5. స్థానికంగా దొరికే వస్తువులు దూరప్రాంతం నుండి వచ్చే వస్తువుల కన్నా చౌకగాను, నాణ్యతగానూ వుంటాయి. ఏదైనా చౌకగా దూరప్రాంతం నుంచి వచ్చిందంటే అది తప్పక పర్యావరణాన్ని నాశనం చేసే ఏ ప్లాస్టిక్ వస్తువో అయి వుంటుంది.

6. మన దైనందిన జీవితంలో రోజు వాడే వస్తువులు అన్నీ స్థానికులచే తయారు లేదా ఉత్పత్తి అయి స్థానిక సంస్థలకు వస్తున్నాయి. కనుక ఈ వస్తువులు కొనడం ద్వారా స్వయం ఉపాధి కల్పించిన వారమవుతాం.

7. సమాజంలో సాటి వారందరికి స్వయం ఉపాధి కల్పించడం అనే ధర్మాన్ని కాపాడండి. లోకవిద్యా బజార్‌లోని వస్తువులనే కొనండి.

8. స్థానిక ఉత్పత్తిదారులు, వినియోగదారులు ఇరుపక్షాల వారికి లాభం చేకూర్చే సమాజ పునర్ నిర్మాణానికి దోహదం చేస్తూ వ్యక్తిగత లాభాల కన్నా అందరికి ఉపాధి లభించే స్వయం సమృద్ధిని సాధించే స్థానిక సమాజాన్ని నిర్మించండి.

9. స్థానిక ఉత్పత్తుల ద్వారా స్థానికంగా అందరికీ ఉపాధి కల్పించే ఈ ఉద్యమం మన పిల్లల్ని ఉద్యోగాన్వేషణలో దూర ప్రాంతాలకు, కష్టనష్టాల కోర్చి పంపక్కరలేదు.

10. ఇప్పటిదాకా ప్రపంచంలో ఏ దేశంలోనూ ప్రభుత్వమే అందరికీ గౌరవప్రదమైన వేతనాలలో జీవించే ఉపాధి కల్పించిన దాఖలాలు లేవు.

11. పనిచేయగలిగిన ప్రతీ వ్యక్తికి తన ప్రాంతంలో తయారు చేసే ఉత్పత్తులకు సేవలకు గిట్టుబాటు ధర ఎంత ఉండాలంటే స్థానిక ప్రభుత్వోద్యోగులకు శాస్త్రీయంగా ఎలా వేతనాలు నిర్ణయింపబడతాయో (కనీస వేతనం) అదే ప్రాతిపదికతో గిట్టుబాటు ధరలు నిర్ణయించాలి.

లోకవిద్య బజార్ స్థాపన ద్వారా నూతన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి దారితీయడానికి ఆచరణాత్మక కార్య పద్ధతులను ప్రస్తుతం ఉన్న సంతలలో ప్రతీ వృత్తి విద్య నుండి, ఉత్పత్తిదారుల నుండి సభ్యులతో నిర్మితమయ్యే లోకవిద్యా పంచాయితీలలో నిర్ణయాలు జరగాలి. అటువంటి పంచాయితీలలోనే మనందరి జీవితాలు మరింత సుఖవంతంగా, హెచ్చుతగ్గులు లేకుండా జీవించే సమాజ నిర్మాణానికి దారితీస్తాయి. ఇటువంటి ప్రయోగం చేసే ప్రతీ స్థానిక సంత దేశవ్యాప్తంగా నడుస్తున్న స్థానిక సంతలకు మార్గదర్శకం కావాలని లోకవిద్య జనాందోళన విశ్వసిస్తోంది.



# లోకవిద్య బజార్

డా॥ క్రిష్ణరాజులు

ప్రతులకోసం

**లోకవిద్య జనాందోళన**

ఇం.నెం. 13–10–100, న్యాగడ్డిఅన్నారం,

శివగంగ సినిమాహాళ్ళ వెనుక, హైదరాబాద్–500060

ఫోన్ : 040–24152155

e-mail : tnrkoundinyasa@yahoo.com

# లోకవిద్య బజార్

లోకవిద్య సమాజంలో ఉత్పత్తిదారులందరికీ గౌరవప్రదమైన శాశ్వత ఉపాధి కల్పన కోసం వస్తువులు, సేవలు గిట్టుబాటు ధరకు అమ్మే సంతే లోకవిద్య బజార్.

స్థానిక సంత :

ప్రతీవారం స్థానికంగా జరిగే సంతలలో ఆ చుట్టుపక్కల 15, 20 గ్రామాల్లో ఉత్పత్తయిన వస్తువులతో పాటు, తినుబండారాలు అమ్మేవాళ్ళు, మరమ్మత్తు చేసేవారు, కాఫీ హోటళ్ళు, మంగలిషాపులు, తాళాలు మరమ్మత్తు చేసేవారు, చెప్పులు కుట్టేవారు, కమ్మరి పనులు చేసేవారు, దర్జీలు, స్థానిక సంతల దగ్గరే తమ దుకాణాలు నడపడం, వీటన్నిటినీ ఈ 15, 20 గ్రామాలవారితో పాటు ఇతరులు కూడా సందర్శించి సరసమైన ధరలకు దైనందిన జీవనానికి అవసరమైన వస్తువులు, సేవలు పొందడం, చూస్తున్నాం. ఇక్కడ వినియోగదారులు, ఉత్పత్తిదారులు అనే విభజన లేదు. ఉత్పత్తి దారులు, సేవలందించేవారు కూడా వినియోగదారులే. వీరందరూ వస్తువు ధరను, సేవల ధరలను నిర్ణయించే జ్ఞానం కలిగి వుంటారు. ధాన్యాలు, కూరలు, మసాలా దినుసులు, వీటన్నింటి యొక్క నాణ్యత, ధరల గురించి తమ తల్లిదండ్రులతో, పెద్దవారితోపాటు సందర్శించి, సంపాదించిన జ్ఞానంతో ఖరీదు చేస్తుంటారు. ఆ ప్రాంత ప్రజలందరికీ వినియోగదారులకు ఏం కావాలి, ఏ ధరలలో కావాలి అన్నది ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు తెలుసు. ఈ సంతలలో వస్తువుల, సేవల ఖరీదు చెయ్యడంతో పాటు అనేక విషయాలు పరస్పర మార్పిడి ద్వారా వస్తువుల నాణ్యత, తయారీ జ్ఞానంతో సరసమైన ధరను నిర్ణయించడం జరుగుతోంది.

ఇక్కడ లావాదేవీలన్నీ నగదు రూపేణా జరగడంతో ఈ పద్ధతి ఆ ప్రాంతంలో మరిన్ని జీవనోపాధులను సృష్టించడానికి ఉపయోగ పడుతుంది. అక్కడ కూడా అరువు పద్ధతి వున్నా ఎటువంటి మోసాలు లేని పరస్పర విశ్వాసాలపై ఆధారపడి వుంటాయి. ఈ సంతలకు వచ్చిన సందర్శకులు తమ దగ్గర వున్న వార్తలు, మెలకువలు ఇతరులతో పాటు పంచుకొని ఈ వ్యవస్థను పరిపుష్టం చెయ్యడం జరుగుతూనే ఉంటుంది. కొంతమంది ఇక్కడ కుటుంబ వ్యవహారాలు, కుల, మత, సాంఘిక వ్యవహారాలు కూడా చర్చించుకుంటూ వుంటారు. ఒక్కమాటలో భారతీయ సంత అంటే ఆ ప్రాంతంలో వుండే వివిధ రకాల ఆలోచనలు, ఆచరణలో వున్న ప్రజలు తమ వస్తువులతో పాటు తమ జ్ఞానాన్ని మానవత్వపు విలువలతో ఇతరులతో పంచుకునే వేదికగా ప్రధానంగా చూడవచ్చు. ఈ సంతలలో లాభాపేక్ష కంటే కూడా మానవ సంబంధాలే ముఖ్యం.



ఈ స్థానిక సంతలకు విరుద్ధంగా పట్టణాల్లోని, పెద్ద పెద్ద బజార్లు, సూపర్ మార్కెట్లలో జరిగే ప్రతీ లావాదేవీ లాభాపేక్షతో మాత్రమే జరుగుతుంది. అక్కడ అమ్మే వారికి కొనే వారికి మధ్య మానవ సంబంధాలు ఉండవు. వస్తువుల నాణ్యత, ధరలపై ఏ ఒక్కరూ పూర్తి అవగాహనతో మాట్లాడే అవకాశాలు ఉండవు. ఇక్కడ దైనందిన అవసరాల కంటే వాణిజ్య ప్రకటనల ద్వారా సౌఖ్యవంతమైన జీవితం అన్న పేరుతో కొనే వస్తువులే ఎక్కువ. ఒక్కమాటలో ఇక్కడ లభించే వస్తువులు, ఉత్పత్తి చేసే ప్రాంతాలు సుదూరంగానూ,లాభాపేక్షతోనూ, ప్రాపంచీకరణలో భాగంగానూ, స్థానిక అవసరాలతో సంబంధం లేకుండాను వుండడంతో దీన్నే వినిమయ సంస్కృతి అంటారు.

**ఉత్పత్తి వినిమయ ధరల మధ్య సంబంధం**

స్థానిక సంతలతో పోలిస్తే పట్టణ మార్కెట్లలో, సూపర్ బజార్లలో ధరలకు ఒక పద్ధతి లేదు. మానవ సంబంధాలు లేని ఈ పెద్ద బజార్లలో ధరలు నిర్ణయించడానికి అమ్మేవారు కాక కనబడని ఆ బజారు అధిపతులు, లాభా పేక్షతో నిర్ణయించే ధరలకు మాత్రమే అమ్మాలి. స్థానిక సంతలలో చేసే బేరసారాలు ఇక్కడ చెయ్యడానికి అమ్మే కార్మికులకు ఎటువంటి అధికారాలు వుండవు. 1991 నుంచి పెద్ద ఎత్తున మొదలైన ప్రపంచీకరణ వల్ల ఆహార ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరగడానికి ప్రధాన కారణం వినియోగదారులకు ఉత్పత్తి దారులకు ఎటువంటి సంబంధం లేకపోవడమే.

స్థానిక సంతలలో దైనందిన జీవితంలో మనకు ఉపయోగపడే వస్తువుల ధరలు పట్టణ ప్రాంతపు పెద్ద దుకాణాలలో ధరల కన్నా చాలా తక్కువ అని మనం గమనించవచ్చు. ప్లాస్టిక్‌తో తయారుచేసే కుండలు, బకెట్లు, మగ్గులు, చెప్పులు మొదలైన వాటి ధర మట్టితో, లోహాలతో, కలపతో, తోలుతో తయారుచేసే వస్తువుల ధర కన్నా చౌకగా వుంటాయి. ఈ ప్లాస్టిక్ వస్తువుల ప్రవేశంతో కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, తోలు పనిచేసేవారి ఉపాధిని దెబ్బకొట్టటమేగాక, ప్లాస్టిక్ ప్రవేశంతో పర్యావరణ ప్రమాదం పెరిగింది. ఉదా: ఖరీదైన కుండ ప్లాస్టిక్ లేదా అల్యూమినియం కుండ కన్నా ధర ఎక్కువ వుండడమే గాక తక్కువ కాలం మన్నుతుంది. అంచేత ఫ్యాక్టరీల నుంచి వచ్చే ప్లాస్టిక్ వస్తువులకి కుమ్మరిచేసిన వస్తువుల కన్నా గిరాకి ఎక్కువ. దీంట్లో చూడాల్సిందేమంటే చవకగా కొనండి ఖరీదుకే అమ్మండి అనే మార్కెట్ ఆర్థిక సూత్రం లాభాపేక్షతో ఆచరించడమే. ఈ రోజు ఈ దృక్పథం స్థానిక సంతలలో కూడా ప్రబలింది.

ఈ దృక్పథం సన్నకారు రైతులను, వృత్తి విద్యా కళాకారులను, చిన్న తరహా వ్యాపారస్తులను ఇతర చేతి వృత్తుల వారిని క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితులకు దారితీసి, దాని

నుండి తప్పించుకొని ఇతర వ్యాపకాలకు, మళ్ళిస్తోంది. దీంతో స్థానికంగా తయారు చేసే వస్తువుల, పంటల, సేవల ఉత్పత్తులు రోజురోజుకు క్షీణిస్తున్నాయి. ఈ పరిస్థితిలో పట్టణంలోని పెద్ద బజార్లవలె స్థానిక సంతలలో కూడా పెద్ద ఎత్తున దైనందిన జీవితంలో ఉపయోగించని వినియోగ వస్తువుల అమ్మకాలు పెరిగాయి.

**స్థానిక సంతలోని కొనుగోలు, అమ్మకందార్లు ఎవరు?**

5, 6 కి.మీ. పరిధిలోని 10, 12 గ్రామల ప్రజలు ఒక సంతలో చేరి ఈ క్రింది కొనుగోళ్ళు జరుపుతుంటారు.

1) తృణధాన్యాలు, పప్పులు, కూరగాయలు మొదలైనవి పండించే సన్నకారు రైతులు
2) మనకి దైనందిన జీవితంలో ఉపయోగించే వస్తువులు తయారుచేసే వృత్తికారులయిన చేనేత వృత్తిదారులు, కమ్మరులు, కుమ్మరులు, దర్జీలు మొదలైనవారు.
3) మన రోజువారీ సేవ అవసరాలను తీర్చే చాకలి, మంగలి, వడ్రంగి, టీ అమ్మేవారు, చిరుతిండ్లు తయారుచేసేవారు, తాళాలు, సైకిళ్ళు, మోటార్లు, వాచీలు, మరమ్మత్తు చేసేవారు, తోపుడు బండ్లవాళ్ళు, కూలీలు.
4) ప్లాస్టిక్ వస్తువులు, పురుగుమందులు, మూలికలు, స్థానిక మందులు, మసాలా, దినుసులు, పాత్రలు మొదలైనవి అమ్మే చిన్న దుకాణాదారులు, వ్యాపారస్తులు ఇంటిని నడపగలిగే తినుబండారాలను తయారుచేసే వారితో పాటు ఇతర పై వృత్తులలో భాగంగా వున్న మహిళలు. సాధారణంగా సంతలలో మగవారి కంటే మహిళలే ఎక్కువ వుంటారు.

వీరిలో అత్యధికులు నిరక్షరాస్యులు లేదా కనీస చదువుకున్నవారు అంటే స్థానిక స్కూళ్ళలో చదవడం, రాయడం మాత్రమే నేర్చుకున్నవాళ్ళు. వీళ్ళలో ఎక్కువ శాతం తమ పాఠశాల చదువును తమ ఉపాధికి ఉపయోగించనివారు. వారి వృత్తి విద్య ఏ పాఠశాలలోనూ నేర్పరు. అత్యంత ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే సంతలోని ఏ చదువులేని మహిళల్లో అత్యధిక శాతం పాఠశాల చదువుకు సైతం నోచుకొని వారు లెక్కలలో నిష్ణాతులే.

ఈ ఆచరణాత్మక జ్ఞానాన్ని వారి కుటుంబాలలోనే, గ్రామంలోనే ఇతర సమూహాలతో జరిపే లావాదేవీల ద్వారా నేర్చుకున్నదే. వీరు తమ తల్లి తల్లిదండ్రుల దగ్గర, పెద్ద వారి దగ్గర అన్నింటికన్నా ముఖ్యంగా గమనించడం ద్వారా, ఆచరించడం ద్వారా తమ జ్ఞానాన్ని అంటే లోకవిద్య జ్ఞానాన్ని పొందుతున్నారు. దీన్నే దైనందిన జీవితంలో పొందే వ్యవహారిక జ్ఞానంగా చెప్పవచ్చు. ఈ వ్యవహారిక జ్ఞానాన్నే ఒక తరం నుండి తర్వాత తరాలకు



అప్రతిహతంగా వేల ఏండ్ల నుంచి కొనసాగుతూ వస్తోంది. పరస్పర అభిప్రాయాలు, జ్ఞానం పంచుకోవడంతో తరతరాలుగా అది మరింత పరిపుష్టమై ఉన్నత స్థితికి చేరుతోంది. వీరి జ్ఞానం ఇతర ప్రాంతాలతో అనుబంధం వల్ల వారి జ్ఞానంతో మరిన్ని మెలకువలు సంతరించుకుంటున్నాయి. ఉదా: ఏ చదువురాని కోట్లాది మంది ఈ రోజు సెల్‌ఫోన్ వాడడం, సెల్‌ఫోన్‌లో ఫోన్ నెంబర్లు గుర్తించడం వంటి మార్పులు తీసుకొచ్చింది. నేడు ప్రతీ వ్యక్తి ఇంగ్లీష్‌లో అంకెలు చెబుతున్నాడంటే అతిశయోక్తి కాదు. వీరంతా తమ జ్ఞానం మీద ఆధారపడి దైనందిన జీవితంలో ఈ సమాజంలో తమ కార్యకలాపాల ద్వారా తమ జ్ఞానం ద్వారా జీవిస్తున్నారు. లోకవిద్య అంటే ఇదే.

**స్థానిక సంతలు ప్రజలకు ఎందుకు అవసరం?**

ఈ సంతలో తమదైనందిన జీవితాలకు కావలసిన వస్తువులు సరసమైన ధరలకు దొరుకుతాయని తను ఉత్పత్తి చేసిన వస్తువులు కానీ, ధాన్యాలు, కూరలు లేదా సేవలకు మంచి గిరాకితో గిట్టుబాటు ధర దొరుకుతుందని తెలుసు కనుకనే ప్రతీ కుటుంబం నుంచి ఒకరు లేదా ఎక్కువమంది ఈ సంతలో భాగస్వాములౌతారు. ఒక్క మాటలో సామాన్య జీవితానికి స్థానిక ప్రజలకు దైనందిన అవసరాలకు సంత ఒక కేంద్రం, ఇక్కడ ధరలు వట్టి లాభాపేక్షతో కాకుండా ఇతరుల అవసరాలు తమ అవసరాలను దృష్టిలో వుంచుకొని గిట్టుబాటు ధర నిర్ణయించడం జరుగుతుంది. ఇతరుల కష్టానికి సరైన ప్రతిఫలం చెల్లించాలనే భావన ప్రతీ వ్యక్తిలోనూ సహజంగా వుంటుంది. ఈ ప్రాంతంలో ప్రజలు తమ ఆచార వ్యవహారాలు, కుటుంబ ఆర్థిక స్థితి ప్రకారం తమ జీవనోపాదులను నిర్ణయించుకుంటారు. కుటుంబంలోని పిల్లలంతా తమ పెద్దల ద్వారా తమ బంధువర్గం ద్వారా గ్రామంలోని ఇతర సమూహాలతో సంబంధం ద్వారా భవిష్యత్‌లో తన ఉపాధిని, తన కుటుంబాన్ని ఏవిధంగా మలచుకోవాలో నేర్చుకుంటారు. ఈ స్థానిక సంతల ద్వారా తమ వస్తువులకు, సేవలకు, పంటలకు గిట్టుబాటు ధర దొరుకుతుందని తమ కుటుంబానికి కావల్సిన వస్తువులన్నీ సమకూర్చుకోవడానికి ఆ ధర సరిపోతుందని నిశ్చింతగా వుండడానికి దోహదపడేది స్థానిక సంత. ఇది మానవ సమూహాల మధ్య తన గుర్తింపుతో, గౌరవంతో జీవించడానికి మానవ సంబంధాలను లాభాపేక్ష కంటే ప్రధానంగా చూడడానికి దోహదపడుతుంది.

**పట్టణాలలోని పెద్ద షాపుల్లో ధరలు, స్థానిక సంతలో ధరలు ఏవిధంగా నిర్ణయించబడతాయి?**

కొనేవాడు ప్రతీవాడు చెప్పిన ధర చెల్లించి కావల్సిన వస్తువు పట్టణ మార్కెట్లో కొనుక్కోవల్సిందే. దీని ధర ఎవరు ఏవిధంగా నిర్ణయిస్తారు? మనకు తెలిసిందేమిటంటే

గ్రామీణ ప్రాంతపు ధరకన్నా చిన్న వర్తకుల వద్ద కన్నా, ఈ పెద్ద బజార్లలో ధర ఎక్కువగా వుంటుంది. ఈ ధర పెరగడానికి కారణం తయారీ ధరతోపాటు, రవాణా, మార్కెట్ కమీషన్, వాణిజ్య ప్రకటనల చార్జీలు, పన్నులతో పాటు పెట్టుబడి మీద వడ్డీ మరియు లాభం కలుపబడటమే. ఈ పై ఖర్చులన్నీ లేకపోవడంతో తయారీ ధరకే స్థానిక సంతలో అమ్మకాలు జరుగుతాయి.

**తయారీధర నిర్ణయం ఎలా జరుగుతుంది?**

మొదట పెట్టుబడి, ముడిసరుకులు, విద్యుత్ చార్జీలు, కార్మికుల కూలీ కలిపితే ప్రాథమికంగా ఉత్పత్తి ఖర్చు తెలుస్తుంది. ఈ ముడిపదార్థాలు – విత్తనాలు, ఎరువులు, నీరు, పత్తి, ఉన్ని, కలప, ఇనుము, మట్టి, తోలు లాంటి పదార్థాలు స్థానికంగా స్థానిక ధరలకు దొరుకుతాయి. అవే ముడి పదార్థాలు పారిశ్రామిక అవసరాలకు మరింత తక్కువ ధరలకు దొరుకుతాయి. స్థానిక సంతలో ఉత్పత్తి దారుడికి కనీస జీవనానికి కావల్సిన ధర ఇవ్వడం జరుగుతుంది. ఒక్కమాటలో ముడిపదార్థాలు తయారు చేయడానికి మనిషి బతికి వుండడానికి కావల్సిన కనీస అవసరాలకు సరిపడే ధర అన్నమాట. కనీస అవసరాలంటే ధాన్యాలు, పప్పులు, నూనె, కూరగాయలు మొదలైన వాటి ధర అన్న మాట. ఈ ఉత్పత్తిదారుడు తన కుటుంబ సభ్యుల కనీసవసరాలు తీర్చుకుంటూ పనిచేసే పరిస్థితిలో వుండడం. ఉత్పత్తికి కావల్సిన ద్వితీయ ప్రాధాన్యత గల విద్యుత్ పరిశ్రమలకు ప్రధాన వనరుగా వుంటే, లోకవిద్యలో ఉత్పత్తి చేసే రైతులు, పద్మశాలీలు, ఇతర వృత్తిదారులు ప్రధానంగా తమ శారీరక శ్రమ మీద, లేదా పశువుల శ్రమ మీద ఆధారపడి ఉత్పత్తి చేయడం జరుగుతుంది. వ్యవసాయానికి కావల్సిన ఇంధనం ప్రకృతిలో లభించే సూర్యరశ్మి, నీరు, శారీరక శ్రమ, పశువుల శ్రమ, పశువుల దాణాకు, మనుషులు బతకడానికి కావల్సిన కనీస గిట్టుబాటుధర అమ్మే ధరగా నిర్ణయించబడుతుంది.

పారిశ్రామిక ఉత్పత్తుల ధర నిర్ణయించేటప్పుడు వస్తువులో చూపించిన ముడిసరుకు, వాడిన విద్యుత్, కార్మికుల జీతాలు, మరియు ఇతర ఖర్చులు నిర్ణయించడానికి కార్మిక సంఘాలు ప్రభుత్వంతో, పారిశ్రామిక వేత్తలతో ఎప్పటికప్పుడు సంప్రదింపుల ద్వారా సరైన వేతనాలు చెల్లించడానికి ఒప్పందాలు కుదుర్చుకుంటారు. మనం సూక్ష్మంగా గమనిస్తే తిండికి సంబంధించిన ముడి పదార్థాలకు ఎప్పుడు సరి అయిన ధర నిర్ణయించడం జరగడం లేదు. వీటి ధర అందరికి అందుబాటులో వుండాలనే పేరుతో కనిష్టస్థాయిలో ఉంచడం జరుగుతోంది. అందుకే రైతులు, వృత్తిదారులు తమ ఉత్పత్తులకు ఏ ధర లభిస్తుందో ఎప్పటికీ చెప్పలేరు. వారి కుటుంబ అవసరాలు తీరతాయో లేదో తెలియదు.



సమాజం నడవడానికి, సమాజంలో వున్న ప్రతీ ఒక్కరూ బతకడానికి కావల్సిన ధర చెల్లించడం, దానితో అందరూ గౌరవప్రదంగా జీవించడం ఒకనాటి మాట. అందుచేత గత 150 సం॥ల క్రితం వరకు గ్రామీణ ప్రాంతాల్లో అనువంశికంగా, తరతరాలుగా ఒకే వృత్తిలో గౌరవప్రదంగా జీవించడం జరుగుతుండేది.

విదేశీ పాలనతో ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు మొదలైన నూతన ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకునే భాగంలో తమ వృత్తి విద్యలను వదిలిపెట్టడం ప్రారంభించారు. ఎప్పుడైతే తన వృత్తి విద్యలో తనకు గౌరవ ప్రదమైన జీవితాన్ని శాశ్వత ప్రాతిపదికన అందించలేదో అటువంటి ఉపాధి అవకాశాలను వృత్తులను లోకవిద్య సమాజం వదలాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**జ్ఞానం, నైపుణ్యత, నిర్వహణ**

ధరలో ఇమిడి వుండే మరో అంశం ఏమిటంటే ఉత్పత్తిదారుడి యొక్క జ్ఞానం, నైపుణ్యత, ఉత్పత్తి అంశాలను ఒకచోట కూర్చే నిర్వహణా ఖర్చులు కూడా ధరలో భాగమే.

ఫ్యాక్టరీలలో తయారుచేసే టాటా కంపెనీ వారి “పార” ఖరీదు స్థానిక కమ్మరి తయారుచేసే “పార” కంటే చాలా ఎక్కువ. అలాగే బాటా కంపెనీ వారి పాదరక్షలు స్థానిక తోలు కార్మికుల చేసే పాదరక్షల కంటే ఖరీదెక్కువ. కారణం ఏమిటని అడిగితే అ వస్తువులు యంత్రాలపై తయారవుతున్నాయి కదా అంటారు. మరింతగా విశ్లేషిస్తే ఈ యంత్రాలపై పనిచేసే కార్మికులకు, దానిపై అజమాయిషీ చేసే సూపర్ వైజర్లకు, స్థానిక తోలు పరిశ్రమ కార్మికుల కన్నా వేతనం అనేక రెట్లు ఎక్కువ దొరుకుతుంది. దీనికి కారణం ఆ ఉత్పత్తి రంగంలో పారిశ్రామిక కార్మికుల జ్ఞానం చాలా ఉన్నతమైందని చెబుతారు. వారు ఆ జ్ఞానాన్ని కాలేజీల ద్వారా సంపాదిస్తారు. అంటే వారి డిగ్రీలే వారికి ఉపాధిని సంపాదిస్తున్నాయి. కమ్మరి, తోలు కార్మికుడు, ఇనుము, తోలుతో చేసే ఉత్పత్తులకు కూడా జ్ఞానం అవసరమే. వీరి జ్ఞానం అనువంశికంగా గమనించడం ద్వారా పెద్దల నుండి తమ సమాజం నుంచి నేర్చుకున్నవే కానీ కాలేజీ నుండి కాదు. అందుకే వారికి పారిశ్రామికరంగంలో ఉద్యోగాలు దొరకవు. లోకవిద్యలో ఉత్పత్తులకు వారి శ్రమకు సరిపడా వేతనం దొరుకుతుంది. కానీ వారి వస్తువుకు మంచి ధర దొరకడం లేదు.

పారిశ్రామిక ఉత్పత్తులు అన్నీ ఒకే రకంగా మూసపోసినట్లు వాటి సైజు, రంగులో కానీ, చూడడానికి కానీ ఒకే రకంగా కనబడడానికి కారణం యంత్రం. వినియోగదారుడు వాటిలో నుంచే వస్తువులు కొనాలి. కానీ లోకవిద్యలో పనిచేసే కమ్మరి, తోలు వస్తువుల తయారీదారుడు చేసే వస్తువులు ఏ రెండూ ఒకే రకంగా వుండక తేడాగా కన్పిస్తాయి.

అంతేగాక వినియోగదారుడి అభీష్టం మేరకు మార్పులు, చేర్పులతో చేయడం జరుగుతుంది. ఒక్కమాటలో కమ్మరి, తోలు కార్మికుడు తమ వ్యక్తి గత నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశం వుంటుంది. నూతన నమూనాన్ని తయారుచేయగలిగిన కళాకారుడిని ఉన్నత నైపుణ్యంగల కళాకారుడిగా గుర్తించబడతాడు. ఈ వైవిధ్యంగల లోకవిద్య వస్తువుల స్థానే, పారిశ్రామిక వస్తువులు కొనడానికే ఈ రోజు వినియోగదారుడు మొగ్గుచూపుతున్నాడు. ఆ విధంగా స్థానిక కళాకారులకు గుర్తింపు, ఉపాధి కలిగించడం కష్టమౌతుంది.

కాలక్రమేణా ఈ లోకవిద్య వృత్తిదారుల కుటుంబాలు, పిల్లలు కూడా పారిశ్రామిక ఉత్పత్తుల వైపు చూడడంతో వృత్తి విద్యలతో బతకాలనే, బతుకుతామనే నమ్మకం రోజురోజుకు దిగజారుతోంది.

**పట్టణంలోని పెద్ద బజార్లకు అనుబంధంగా స్థానిక సంతల వల్ల నష్టాలు**

నువ్వు ప్రత్యర్థిని పోటీలో ఎదుర్కోలేకపోతే వాడితో కలిసిపో అనే సూత్రం ఏదోలా బతకాలనే వారికి సరిపోతుంది. ఈ రోజు లోకవిద్య సమాజంలో పనిచేసే వృత్తిదారులంతా అంతర్జాతీయ మార్కెట్లలో తమ స్థానాన్ని వెతుక్కోమని స్థానిక సంతలలో స్థానికంగా తయారైన వస్తువులు కాకుండా సుదూర ప్రాంతం నుండి వచ్చిన వస్తువులను అమ్మడానికి, ఆ వస్తువులతో స్థానిక వస్తువులు పోటీ పడాలని చెప్పడం జరుగుతోంది. మూసపోసిన, పెద్ద ఎత్తున పరిశ్రమలలో యంత్రాలపై తయారైన వస్తువులతో, మానవ శ్రమతో తయారైన వస్తువులకు గిట్టుబాటుధర దొరకక తమ ఉత్పత్తులు మానేసి దూరప్రాంత వస్తువులకు చిరు వ్యాపారస్తునిగా మరియు దూరప్రాంత వస్తువులు మరమ్మత్తులు చేసే వారిగా మారిపోవడం గమనిస్తున్నాం. సైకిలు, మోటార్లు, సెల్‌ఫోన్లు, టీవీ, రిఫ్రిజిరేటర్లు మొదలైన మెకానిక్కులుగా, మారిపోతున్న లోకవిద్య సమాజ యువకులను చూస్తున్నాం. వీరు పారిశ్రామిక ఉత్పత్తులతో పనిచేస్తూ దానిలోని మెలకువలను అర్థం చేసికొంటూ జ్ఞాన సముపార్జన చేసి మరమ్మత్తులు చేసే మెకానిక్కులుగా మారుతున్నారు. ఈ రోజు కోళ్ళపెంపకం కూడా ఒక పరిశ్రమగా మారిపోయింది. ప్రతీ గ్రామంలో ప్రతీ ఇంట్లో ఉండే కోళ్ళ పరిశ్రమ కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతంగా మారిపోతోంది. అలాగే పశు పాలన, పాడి పరిశ్రమ పేరుతో పాలు, మరియు పాల ఉత్పత్తులతో కూడిన తయారీ, అందమైన ప్యాకింగ్, రవాణా మరియు ఉత్పత్తి దారుల వద్ద బట్వాడా ఒక పెద్ద పరిశ్రమగా మారిపోయింది.

ఈ విధంగా పారంపర్య వృత్తి విద్యలో జరిగే వస్తు ఉత్పత్తి స్థానే పారిశ్రామిక ఉత్పత్తులను చిన్న సంతలలో అమ్ముకునే చిరు వ్యాపారులుగా మారిపోతున్నారు. ఎవరైతే



పారంపర్య వ్యవసాయం, చేనేత, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, తోలు పరిశ్రమలలో పనిచేసే వారంతా నానాటికి ఆర్థికంగా చితికిపోతూ అప్పుల్లో కూరుకుపోతూ ఆకలి బాధకు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడడం జరుగుతోంది. ఈ విధంగా స్థానిక సంతలు పెద్ద ఎత్తున ఎక్కడో తయారుచేసిన పారిశ్రామిక ఉత్పత్తులు అమ్మే బ్రాంచిలుగా తయారయ్యాయంటే వృత్తి విద్యాధరులు గౌరవప్రదమైన జీవితాన్ని అందించలేదని అన్ని ఆశలు వదులుకున్నామని భవిష్యత్ లేదని నిర్ణయానికి వచ్చారని అర్థం.

**ఇటువంటి అంధకార పరిస్థితి నుంచి లోకవిద్య సమాజం ఎలా బయటపడాలి?**

ఈ రోజు ప్రభుత్వం, పట్టణ ప్రాంత ప్రజలు ఈ వినిమయ సంస్కృతినే పెంచి పోషిస్తున్నారు. దీనికి ప్రధానకారణం వీరంతా ప్రాపంచీకరణ తప్పదని, ఎక్కడ ఉత్పత్తయినా ఇతర చోట్ల లాభాల కమ్ముకునే సంస్కృతి; ఇతర సమాజం ఏమైనా చవకగా దొరికే వస్తువులు కొంటామనే సంస్కృతి వెర్రి తలలు వేస్తోంది. ఈ పరిస్థితిని ప్రశ్నించేవారు లేకపోతే ఈ వ్యవస్థకు ప్రత్యామ్నాయం చూడకపోతే లోకవిద్యా సమాజంలోని ప్రజలంతా అంధకారంలో చిక్కుకుని ఆకలితో అలమటించక తప్పదు. ఇందులో అతికొద్దిమంది ప్రపంచీకరణ భాగంలో పెద్ద ఉత్పత్తిదారుల చేతులలో చిక్కుకుని, వారి ఏజంట్లుగా మారిపోయి చిరువ్యాపారస్తులుగా మారవచ్చు. కానీ అత్యధిక సంఖ్యలోని లోక విద్యా వృత్తిదారులు, రైతులు, చిరువ్యాపారులు, ఆదివాసీలు మరింతంగా అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఆత్మగౌరవం కోల్పోయి జీవచ్ఛవాలుగా మారిపోయి జీవించవలసిన పరిస్థితులలో ఒక పక్క, ఈ పద్ధతిలో రాజీపడలేని రైతులు నేతన్నలు మొదలైన వారి ఆత్మహత్యలు మరొకపక్క పెరిగిపోతున్నాయి.

మానవత్వం లేని ఈ ప్రపంచీకరణ వ్యవస్థ స్థానే మానవత్వంతో కూడిన ప్రత్యామ్నాయ వ్యవస్థ గురించి ఈ సమాజం ఆలోచించాలి కదా! దీనికి ప్రత్యామ్నాయం సాధారణ ప్రజలందరి జ్ఞాన ఆధారిత వస్తువులు, సేవలు, ధాన్యం, చిరుధాన్యాలు, కూరగాయలు మరియు ఇతర పంటలు ఉత్పత్తి చేసి వాటిని మాత్రమే వాడుకునే సంస్కృతి ద్వారా మానవత్వంతో కూడిన సమాజాన్ని పునర్ నిర్మించగలం. కానీ ప్రస్తుత మార్కెట్ విధానంలో లాభాపేక్షతో జరిగే కార్యకలాపాలను చూస్తూ, మానవత్వపు విలువలున్న ప్రత్యామ్నాయ లోకవిద్య బజార్ నిర్మాణం అంత సులభం కాదు. తరతరాల నుండి వచ్చే ఈ స్థానిక సంతలు తమ జ్ఞానంతో ఉత్పత్తి చేసే వస్తువుల, సేవల స్థానిక వినియోగం లాభాపేక్ష కేంద్రంగా గాక ప్రత్యామ్నాయ మానవ సమాజం నిర్మాణం దిశలో ఎంత ఎక్కువ మంది ఆలోచించితే అంత త్వరగా ప్రత్యామ్నాయం వైపు ప్రయాణం సాగించగలం. లోకవిద్య

సమాజం ఎంత త్వరగా లోకవిద్య బజార్ సమాజ పునర్‌నిర్మాణం కోసం బలంగా ఉద్యమిస్తుందో అప్పుడే నూతన మానవ ఆవిర్భావం జరుగుతుంది.

**లోకవిద్య బజార్ అంటే ఏమిటి?**

ప్రధానంగా లోకవిద్య బజార్‌కి లాభాపేక్ష కన్నా కొన్ని ధర్మ సూత్రాలపై ఆధారపడి నిర్మితమౌతుంది.

1. స్థానిక ఉత్పత్తి దారుడు సాధరణ జీవితానికి కావల్సిన వస్తువులు, సేవలు, ధాన్యాలు, కూరగాయలు మొదలైనవన్నీ తమ జ్ఞానం ఆధారంగా తయారు చేయడం, వాటిని స్థానికంగా సంతలో ఇతరులకమ్మి తనలాగే స్థానికంగా అమ్మడానికి వచ్చిన వారి నుంచి సేవలు, ఉత్పత్తులు కొనడం ప్రధాన సూత్రం.
2. అంతిమంగా తామందించే సేవలు, ఉత్పత్తులు మానవజీవితానికి, సౌఖ్యానికి అందించడం ఒకవైపు, అందరికీ పని కల్పించడం మరొకవైపు వుండడం ప్రధానం.
3. ఇక్కడ జరిపే లావాదేవీలన్నీ ఉత్పత్తి, వినియోగదారుల మధ్య మానవ సంబంధాలు పరిపుష్టం చేస్తూ మరోవైపు అందరికీ ఆత్మగౌరవంతో కూడిన జీవనానికి గ్యారంటీ ఇస్తుంది.
4. ఇక్కడ వినియోగదారులు, అమ్మకందారుల మధ్య సౌభ్రాతృత్వం సమానత్వం ప్రతీ వారి జ్ఞానానికి గౌరవం, అందరి నైపుణ్యానికి సరిపడిన పారితోషికం లాంటి మానవ కేంద్రీకృత నూతన వాణిజ్య సూత్రాలపై ఆధారపడి ప్రస్తుతం దోచుకునే లాభాల కేంద్రీకృతంగా వుండే మార్కెట్ నిర్మూలనకు దారితీస్తుంది. ఇదే ప్రధానంగా ప్రస్తుత వినియోగ సంస్కృతి, అత్యధిక లాభాలు, దోపిడి, అమానవీయ పద్ధతులు స్థానే లోకవిద్య సమాజస్థాపనకు దారితీస్తుంది.

ప్రస్తుత ఆర్థిక పెట్టుబడి కేంద్రీకృతంగా జరుగుతున్న వ్యాపారం మానవుల మధ్య అసమానతను, పెంచుతూ సాంఘిక, ఆర్థిక విభేదాలను పెంచిపోషిస్తూ, అతికొద్ది మంది సమాజంలోని అత్యధికులను దోచుకోవడానికి దారితీస్తోంది. దీనికి ప్రత్యామ్నాయంగా లోకవిద్యబజార్ కొద్దిమందికి లాభాల సంస్కృతికి వ్యతిరేకంగా మానవ సంబంధాలతో సంక్షేమం, ఆత్మగౌరవం, సమానత్వం మొదలైన ప్రజాస్వామ్య మూలాలను పెంచి పోషిస్తూ నూతన సమాజంవైపు అడుగులు వేస్తుంది. ఈ సమాజ నిర్మాణానికి కావల్సిన ప్రధాన స్ఫూర్తి ఏమిటంటే ధర్మంపై ఆధారపడిన నూతన సమాజ నిర్మాణం చేయాలనే ఆకాంక్ష. ప్రస్తుత బజార్ వ్యక్తిగత లాభాపేక్షతో నిర్మితమైంది. దీనిస్థానే సామూహిక ఉత్పత్తి వినియోగాల కోసం సమానత్వం, సౌభ్రాతృత్వం, అన్ని కులాలు, వృత్తులలోని జ్ఞానం సమానమనే ఏక



సూత్ర ధర్మంతో నడుస్తుంది. దీని ధర్మం సాంఘికంగా, ఆర్థికంగా, తాత్వికంగా ప్రతీ ఒక్కరూ ఇతరుల జ్ఞానాన్ని పరిపుష్టం చేయడానికి చేసే ఒక యజ్ఞంలా చేయాల్సిన అవసరముంది. లోకవిద్య బజార్ ఉత్పత్తి, వినియోగ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిచ్చే సమాజ పురోగమానికి దారితీస్తుంది. దీని కేంద్రం స్థానికంగా గ్రామీణ ప్రాంతాలలో కొన్ని గ్రామాల సమూహానికి ఉపయోగపడుతుంది. ఇది సాధారణంగా ఇప్పటికే అనేక ప్రాంతాలలో వునికిలో ఉన్న వారాంతపు సంతగా వుంటుంది. లోకవిద్య సమాజంలో కొన్ని సేవలు ఇళ్ళవద్దకు అందించడం. ఉదా: పాలు, చాకలి, మంగలి మొ॥ సేవలు, ముందు ఇంటర్నెట్ ద్వారా సేవలను ఇంటివద్దకే బట్వాడా చేయడం జరుగుతుంది. ఇటువంటి సేవల బట్వాడా కోసం ప్రసార మాధ్యమానికి, మంచిరోడ్లు, త్వరగా వెళ్ళే రైళ్ళు, చవకగా రవాణాకు జలమార్గాలు, విమాన మార్గాలు, రాబోయే రోజుల్లో మార్కెట్ విస్తరణకు దోహదపడతాయి. ప్రస్తుతం అమలులో వున్న స్థానిక సంచార బజార్లు ఈ దిశలో మరింతగా ఉపయోగపడతాయి.

**లోకవిద్య బజార్ నిర్మాణం ఎలా?**

లోకవిద్య బజార్ నిర్మాణానికి ప్రస్తుత వారాంతపు సంతలే సరయిన ప్రయోగశాలలు. ప్రస్తుతమున్న స్థానిక సంతలలోనే రకరకాల వృత్తిదారులు, ఉత్పత్తిదారుల మధ్య ప్రతీవారం జరిగే జ్ఞాన పంచాయితీలే వేదికగా నిర్మాణం చేస్తూ స్థానిక సంతలను లోకవిద్యా బజార్లుగా రూపొందించవల్సిన అవసరం వుంది. దీనికోసం లోకవిద్యా బజార్లను నిర్మించండి అనే నినాదంతో ప్రయత్నం ప్రారంభించాలి.

**ఈ బజార్‌లో ప్రచారం చేయాల్సిన అంశాల ప్రాధాన్యత ఈ క్రింది విధంగా వుండాలి.**

1. స్థానికంగా తయారైన వస్తువులను, సామాన్లను, ధాన్యాలను, కూరగాయలను మాత్రమే కొనండి.
2. స్థానికంగా దొరికే లోకవిద్య వృత్తిదారుల నైపుణ్యం కలిగిన కార్మికుల సేవలను మాత్రమే వాడండి.
3. స్థానిక వస్తువులు, సేవలు వారి నైపుణ్యాలకు, ఉత్పత్తులకు సరయిన ధర చెల్లించడం ద్వారా స్థానికంగా, గౌరవ ప్రదంగా జీవించే అవకాశం కల్పించడంతోపాటు మన సోదర, సోదరిమణులకే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.
4. దూరప్రాంతం నుంచి, పెద్ద యంత్రాల మీద తయారయిన వస్తువుల ధరలు ఎక్కువగా వుండడానికి కారణం పెట్టుబడిదారుల లాభాపేక్ష దానిస్థానే స్థానిక వస్తువులు కొనడం వలన స్థానిక ప్రజలకు మాత్రమే గిట్టుబాటు ధర లభిస్తుంది.